క్లుప్తంగా

సత్యదేవుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



గుడ్లవల్లేరు: రెండో అన్నవరంగా ప్రసిద్ధి గాంచిన గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్య నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామిని వేద పండితులు పెండ్లి కుమారుడిని చేశారు. తొలుత స్వామికి వేద పండితులు విశేషాభిషేకాలను నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో హోమాలను వేద పండితులు చేపట్టారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



పమిడిముక్కల: మామిళ్లపల్లి శ్రీ గోవిందమాంబా సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 65వ వార్షిక వేడుకలు సందర్భంగా స్వామి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి కల్యాణం తిలకించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం ఆగినపర్రు, మామిళ్లపల్లి గ్రామాల్లో స్వామిని ఊరేగించారు. అర్చకులు చోడవరపు శివరత్నప్రసాద్, సురేష్, గ్రామస్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు



గుడివాడరూరల్: మహిళలు, చిన్నారుల భద్రతకు పోలీస్‌శాఖ ప్రత్యేక భద్రతకు చర్యలు చేపడుతుందని టూటౌన్ ఎస్‌ఐ జాస్మిన్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శక్తి టీం సభ్యులతో కలిసి శుక్రవారం ఉమెన్ సేఫ్టీ యాప్‌లపై అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థినుల ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి మందిర వార్షికోత్సవం



గుడ్లవల్లేరు: అంగలూరు జ్ఞాన సాయి మందిర, తాజుద్దీన్ కుటీర్ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఆ మందిర ప్రధాన నిర్వాహకుడు యలమంచిలి నాగమోహన్, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేకువజామున శ్రీ విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన తదితర పూజలు నిర్వహించారు. చందనోత్సవం, పల్లకీసేవ కార్యక్రమాల్ని చేపట్టారు. మందిర నిర్వాహకులు దుగ్గిరాల శేషుబాబు, దుగ్గిరాల ఆంజనేయప్రసాద్, నాగవల్లీ, తిపిర్నేని రాజా తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకోండి

పమిడిముక్కల: రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి అగ్రి స్టాక్ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ నందు నమోదు చేయించుకుని, విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని ఏఓ గణేష్‌రెడ్డి తెలిపారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, తదితర పథకాల రాయితీలు పొందాలంటే ప్రతి రైతు తప్పనిసరిగా అగ్రి స్టాక్ పోర్టల్ నందు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మినుము పంటలో అవసరమైన మేరకే పురుగుమందులు పిచికారీ చేయాలని, విచక్షణారహితంగా పురుగుమందులు పిచికారీ చేయాకుడదని తెలిపారు.

రమాబాయి అంబేడ్కర్ నేటి తరానికి ఆదర్శం



మండవల్లి: త్యాగానికి, పోరాటానికి నిలువెత్తు నిదర్శనం రమాబాయి అంబేడ్కర్ అని అంబేడ్కర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. స్థానిక అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్ అంబేడ్కర్ సతీమణి మాతా రమాబాయి జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు అంబేడ్కర్, రమాబాయి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కె.శాంతరాజు, మెండా సురేష్, గోరింక గాంధీ, కొండపల్లి రవిప్రసాద్, కె.రవి ప్రసాద్, వి.సుధీర్ పాల్గన్నారు.

విలీనం పేరుతో పాఠశాలల రద్దు?

- 'మా పిల్లలను చదువులకు దూరం చేయొద్దు బాబూ'
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు (ఫైల్)

గుడ్లవల్లేరు: పాఠశాలల విలీనం పేరిట తమ పిల్లలకు కూటమి ప్రభుత్వం చదువును దూరం చేస్తుందనే ఆందోళనలో వారి తల్లిదండ్రులు ఉన్నారు. ఈ విషయమై మండలంలోని పలు చోట్ల ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. గుడ్లవల్లేరు మండలంలోనే 66 ప్రభుత్వ పాఠశాలలకు 30 స్కూళ్లు ఈ విలీనంలో భాగంగా పోయేటట్లు ఉన్నాయి. విద్యా శాఖాధికారులకు తల్లిదండ్రులు తమ గోడు వినిపించినా.. పాఠశాలల విలీనం అనేది పిల్లల చదువులను మెరుగు పరచడానికేనని అధికారులు కొట్టిపారేస్తున్నారు.

నాడు- నేడుతో గతమెంతో మిన్న

గత వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఊరికో బడిని నిర్వహించి, నాడు-నేడు పథకం ద్వారా ఆధునిక హంగులతో విద్యా వ్యవస్థను బలోపేతం చేసింది. ఆ విధానాన్ని కూటమి ప్రభుత్వం కాలరాస్తోందనే విమర్శలున్నాయి. ప్రభుత్వ పాఠశాలలను బాబు ఎత్తివేస్తే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్థానికంగా 1-5వ తరగతి చదువుతున్న చిన్నారులను కిలోమీటర్ల దూరంలో బయట ఉన్న గ్రామాల్లోని పాఠశాలలకు ఎలా పంపుతామని అడుగుతున్నారు. ప్రభుత్వం నెలకు నామమాత్రపు ప్రయాణపు ఖర్చులు ఇస్తామంటే.. ఆ చిన్నారులతో వెళ్లే గార్డెన్‌కు అయ్యే ఛార్జీలను ఎవరు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. దశాబ్దాలుగా నిర్వహించే ప్రభుత్వ పాఠశాలలను సైతం ఎత్తివేసే ప్రయత్నం చేస్తున్న కూటమి ప్రభుత్వం అప్రదిష్ట మూట గట్టుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

ఆందోళనలో తల్లిదండ్రులు



గుడ్లవల్లేరులోని జగనన్న కాలనీతో పాటు చంద్రన్న కాలనీ, అంబేడ్కర్ నగర్‌లోని విద్యార్థులకు అనువుగా ఉన్న ప్రభుత్వ పాఠశాలను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసింది. స్కూల్ తొలగిస్తున్నారని ఆ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనలో ఉన్నారు.

– బి.వి.శ్రీనివాసరరావు, రాజ్యాంగ పరిరక్షణ వేదిక మండల నాయకుడు

30 స్కూళ్ల రద్దుకు రంగం



గుడ్లవల్లేరులోని అంబేడ్కర్ నగర్ స్కూలే గాక మండలంలోని 30 స్కూళ్లను తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. అలా ఏ పాఠశాలను తొలగించినా తల్లిదండ్రులు చూస్తూ ఊరుకోరు. 117వ జీఓను వెంటనే రద్దు చేయకపోతే ఉద్యమ బాట పడితే.. కూటమి ప్రభుత్వానికి ముచ్చెమటలు పడతాయి.

– జి.రవి, వైఎస్సార్ సీపీ మండల యూత్ కన్వీనర్

వైఎస్.జగన్ హయాంలో విద్యకు పెద్దపీట



పేద, బడుగు, బలహీన వర్గాల్లోని పేద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అప్పటి గత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే విద్యా రంగానికి పెద్ద పీట వేశారు. నాడు-నేడు పథకం కింద పాఠశాలలను ఆధునికీకరించి సర్వ హంగులను ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారు జగనన్న. – మేకల అనిల్, వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్లవల్లేరు

'ఎమ్మెల్యే హెల్మెట్ పెడితే ఫాలో అవుతాం'



ఎమ్మెల్యే హెల్మెట్ పెట్టుకుంటే నేను పెట్టుకుంటా అంటూ ప్లకార్డు ప్రదర్శిస్తున్న వైవీ మురళీకృష్ణ

గుడివాడ టౌన్: చట్టం అమలు చేయాలనే వారు తాము కూడా ఆచరించి చూపాలని ఓ వ్యక్తి వినూత్న ప్రదర్శన చేపట్టాడు. గుడివాడ పట్టణానికి చెందిన భవిష్యత్ భద్రతాదళం వ్యవస్థాపకుడు వైవీ మురళీకృష్ణ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పోలీసులు హెల్మెట్ లేని వారిపై పెనాల్టీలు విధించడం మంచి పరిణామం అని తెలిపారు. చట్టాన్ని అమలు చేయాల్సిన ప్రజా ప్రతినిధులు హెల్మెట్ ధరించకుండా ప్రజలపై ఒత్తిడి తేవడం ధర్మం కాదన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారం అంటూ మోటార్ సైకిల్‌పై తిరిగే గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హెల్మెట్ ధరించడం లేదని, ఆయన హెల్మెట్ ధరిస్తే ప్రజలు కూడా ఆదర్శంగా తీసుకుంటారన్నారు. అందుకే తాను ప్రజల్లోకి ఒక సందేశాన్ని పంపుతూ తన వాహనం వెనుక నా నినాదాన్ని ప్లకార్డుపై ముద్రించి పట్టణంలో సంచరిస్తున్నానని ఆయన తెలిపారు.

మొక్కల తొలగింపు వివాదాస్పదం



హైస్కూల్ ఎదురుగా మొక్కలను పెకలిస్తున్న దృశ్యం

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థాన సమీప హైస్కూల్ వద్ద మొక్కల తొలగింపు వివాదాస్పదమైంది. వైఎస్సార్ సీపీ హయాంలో నూతనంగా నిర్మించిన అనివేటి మండపం దగ్గర నుంచి ప్రారంభ స్వాగతద్వారం వరకు సీసీ రోడ్డు నిర్మించాలని భావించారు. దీనికి అనుగుణంగా మొత్తం రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. తర్వాత ఎన్నికలు రావడంతో పనులు నిలిచాయి. ఇప్పటి ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.కోటి నిధులతో ఎనిమిది మీటర్ల రోడ్డుకు ప్రతిపాదనలు పంపారు. అయితే ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు కావడంతో పనులకు అనుమతులు రాలేదు. ఇంతలోనే శుక్రవారం వడ్లకూటితిప్ప గ్రామానికి చెందిన పొక్లెయిన్ డ్రైవర్ ఒక వైపున 30 మొక్కలను పెకలించివేశాడు. గ్రామ ఉపసర్పంచ్ మేడిశెట్టి మహేష్ పొక్లెయిన్ డ్రైవర్‌ను ప్రశ్నిస్తే కాంట్రాక్టరు చెట్లు తీసివేయాలని చెప్పారని సమాధానం చెప్పాడు. అయితే టెండర్ ఖరారు కాకుండా ఇలాంటి పనులు ఏంటి? అని ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయమై ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్‌ను వివరణ కోరగా మొక్కలు ఉన్న ప్రాంతం దేవస్థానానికి సంబంధం లేదన్నారు. తనకు సంబంధం లేని విషయంలో బాధ్యుడిని చేయడంపై రూరల్ ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. అలాగే మొక్కలు తొలగింపు విషయంపై రహదారి నిర్మాణానికి కొలతలు వేసిన పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్‌ను వివరణగా కోరగా పర్యావరణానికి హాని కలిగించే కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని ప్రభుత్వం సైతం ఆదేశాలు ఇచ్చిందన్నారు. మొక్కలు తొలగించి రోడ్డును వేస్తున్నారని తెలిపారు. ఆ మొక్కలను గ్రామస్తులే తొలగించుకున్నారని పేర్కొన్నారు.

ఎన్నికల కోడ్ పట్టదా?



విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పక్కన అధికార పార్టీ ఫ్లెక్సీ

కురుమద్దాలి(పామర్రు): ఎన్నికల నిబంధనల కోడ్ కారణంగా గత ప్రభుత్వ బ్యానర్లే ఎక్కడా లేకుండా చేసిన పంచాయతీ అధికారులకు పామర్రు మండలం కురుమద్దాలి గ్రామ పరిధిలోని విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిలోని పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న టీడీపీ బ్యానర్ వారికి కనిపించలేదా అని స్థానికులు శుక్రవారం చర్చించుకున్నారు. ఈ జాతీయ రహదారి వెంబడి రోజూ జిల్లా స్థాయి అధికారులు, మండల అధికారులు ప్రయాణిస్తున్నా వారికి ఈ బ్యానర్ కనబడక పోవడం విచారకరమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలను పాటించి బ్యానర్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



కొమరవోలు ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజేంద్రప్రసాద్

కొమరవోలు(పామర్రు): సైబర్ నేరాలపై అందరికీ అవగాహన ఉండాలని పామర్రు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కొమరవోలు ప్రజలకు సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ గంగాధర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో అవగాహన సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగాల కోసం ఎక్కడా డబ్బులు కట్టొద్దన్నారు. లోన్స్ యాప్స్ నుంచి లోన్ తీసుకోవద్దని తెలిపారు. అనవసరమైన చోట్ల క్యూ ఆర్ కోడ్‌లను స్కాన్ చేయవద్దన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

కైకలూరు: పాఠశాలల్లో, ఇతర ప్రదేశాల్లో బాలికలపై బ్యాడ్ టచ్‌ను గుర్తించి తక్షణం ధైర్యంగా ఫిర్యాదు చేయాలని టౌన్ ఎస్ఐ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో బాలబాలికలకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌లపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆకతాయి వేధింపుల నివారణ తక్షణ సాయం కోసం డయల్ 112 ఉపయోగించవచ్చన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్స్ కె.ప్రియాంక, నజ్మ, ఎస్.జాకబ్, మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్లు ఎం.లీలావతి, కె.ప్రియాంక, హెచ్‌ఎం. ఎం.ముబిన్‌ఖాను పాల్గొన్నారు.

నేటి నుంచి సిద్ధేంద్ర యోగి జయంతోత్సవాలు

కూచిపూడి(మొవ్వ): ప్రముఖ నాట్య క్షేత్రం కూచిపూడిలో ఈ నెల 8,9 తేదీల్లో కూచిపూడి నాట్య ఆరాధ్యులు శ్రీ సిద్ధేంద్ర యోగి జయంతి నాట్య మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శ్రీ అఖిల భారత కూచిపూడి నాట్య కళా మండలి ఆధ్వర్యంలో శివాలయం వద్ద గల శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళావేదికపై రెండు రోజులు సాయంత్రం 5.45 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు పసుమర్తి మృత్యుంజయ తెలిపారు. యూఎస్ఏ, హైదరాబాద్, వైజాక్, కూచిపూడి, విజయవాడ, కొత్త గూడెం నుంచి పలువురు కూచిపూడి కళాకారులు పాల్గొని నాట్య ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉల్లాసంగా పాఠశాల వార్షికోత్సవం



హైస్కూల్‌ను దత్తత తీసుకున్న వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రు జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. హైస్కూల్‌ను దత్తత తీసుకున్న విశ్రాంత డీవైఈఓ గన్నమనేని వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గరపడుతున్న కారణంగా విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం హెచ్‌ఎం పాండురంగారావు, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో సీఆర్పీ విజయదుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నత్తనడకన ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులు



అసంపూర్తిగా నిలిచిన రోడ్డు పనులు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు-ఉయ్యూరు ఆర్‌అండ్‌బీ రహదారి మరమ్మతులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించేటప్పుడు చేసే హడావుడి నిర్వహణలో కనిపించటం లేదని విమర్శలున్నాయి. తోట్లవల్లూరు-ఉయ్యూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులను గత నెల 21న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఆర్భాటంగా ప్రారంభించారు. రూ.40 లక్షల అంచనా వ్యయంతో దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు జరపాల్సి ఉంది. పనులు ప్రారంభించిన తరువాత నాలుగైదు రోజులు హడావుడి చేసిన కాంట్రాక్టర్ పనులను అర్ధాంతరంగా నిలిపివేశాడు. దెబ్బతిన్న రోడ్డును కొంతభాగం తొలగించి కంకరతో అభివృద్ధి చేశారు. దీనికి తారు వేయాల్సి ఉంది. కంకర రోడ్డుపై రాకపోకలు సాగించలేక వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే ఇంకా చాలా చోట్ల గోతుల రోడ్డుకు మరమ్మతులు జరపాల్సి ఉంది. రోడ్డుకు మరమ్మతులు జరిగితే కొంతవరకు సమస్య తీరుతుందని ఆశించిన వాహనదారులకు నిరాశే ఎదురవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పెనమకూరులో విజేతలకు అభినందనలు

తోట్లవల్లూరు: జిల్లా స్థాయి ఆటల పోటీల్లో పెనమకూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. 2024-25కి సంబంధించి జిల్లా సెకండరీ పాఠశాలల, గ్రిగ్ మెమోరియల్ సెంట్రల్ జోన్ ఆటల పోటీలు ఈ నెల 4 నుంచి 6 వరకు గోగినేనివారిపాలెంలో జరిగాయి. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి వల్లూరి అభిషేక్ 200, 400, 600 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ ఈవెంట్లలో అండర్-14 విభాగంలో ప్రథమ స్థానం సాధించి గోల్డ్‌మెడల్‌తోపాటు వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాడు. అలాగే 9వ తరగతి విద్యార్థి సమ్మంగి భానుప్రసాద్ అండర్-17 విభాగంలో 3,000, 1,500 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం, 800 మీటర్ల పరుగులో తృతీయ స్థానం సాధించాడు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అభిషేక్, భానుప్రసాద్‌ను, శిక్షణ ఇచ్చిన పీడీ బాలుని పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ సంతోషి రాణి అభినందించారు.



పామర్రులో విజేతలకు సబాస్టియన్ అభినందన

పామర్రు విద్యార్థుల ప్రతిభ

పామర్రు: గ్రిగ్ మెమోరియల్ బాలుర సెంట్రల్‌జోన్‌లో తమ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని స్థానిక ఆసీస్సీ హైస్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ వలసా సబాస్టియన్ తెలిపారు. స్థానిక ఆసీస్సీ హైస్కూల్లో విజేతలను శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన జరిగిన గ్రిగ్ మెమోరియల్ బాలుర సెంట్రల్‌జోన్ పోటీలను గోగినేనిపాలెంలో నిర్వహించారన్నారు. సీనియర్స్ బాలుర విభాగంలో లాంగ్ జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్‌లో డి దయాకర్ ప్రథమ స్థానం సాధించారన్నారు. లాంగ్ జంప్‌లో తృతీయ స్థానం, ట్రిపుల్ జంప్‌లో ద్వితీయస్థానం కె.గౌరిశేఖర్ సాధించారని తెలిపారు. మూడు కిలోమీటర్ల వాకింగ్‌లో కె గౌరి శంకర్ ద్వితీయస్థానం సాధించారన్నారు. జూనియర్స్ విభాగంలో హైజంప్‌లో మనోహర్ ద్వితీయస్థానం, కెల్లక్ష్మీ రాఘవేంద్రరరావు తృతీయ స్థానం సాధించారన్నారు. డిస్కస్ త్రోలో వరుణ్‌తేజ్ తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు.



గెలుపొందిన భట్లపెనుమర్రు విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సత్తా చాటిన భట్లపెనుమర్రు విద్యార్థులు

భట్లపెనుమర్రు(మొవ్వ): ఘంటసాల మండలంలోని శ్రీ ఎంజి రంగా జిల్లా పరిషత్ హైస్కూల్లో రెండు రోజులపాటు జరిగిన ఆటల పోటీలలో మొవ్వ మండలం భట్లపెనుమర్రులోని పోలవరపు శేషయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటి పలు పతకాలు సాధించినట్లు హెచ్‌ఎం సీహెచ్ ఎస్‌కేబీ సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. 100 మీటర్ల పరుగు(గ్రూపు) పందెంలో విన్నర్స్‌గా నిలచి బంగారు పతకం, డిస్కస్ త్రో కే మౌనిష్ ప్రథమ స్థానం, జూనియర్ బాయ్స్ విభాగంలో ఖోఖో రన్నర్స్, 200 మీటర్ల పరుగు పందెంలో సీహెచ్ నితిన్ రన్నర్, షాట్ పుట్‌లో కే మౌనిష్ మూడో స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో బి.యనోహ మూడో స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. సీనియర్ బాయ్స్ విభాగంలో జావిలిన్ త్రోలో జి.చరణ్ సిల్వర్ మెడల్, 100 మీటర్లు (రిలే) పరుగు పందెం(గ్రూపు ఈవెంట్)లో సిల్వర్ మెడల్, షాట్ పుట్, డిస్కస్ త్రోలో ఎం.హరీష్ తృతీయ స్థానం సాధించినట్లు తెలపిఆరు. శిక్షణను ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు కే వెంకటేశ్వరరావుతో పాటు గెలిపొందిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

10 నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

మొవ్వ: మొవ్వ గ్రామంలోని వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి మూడు రోజులు పాటు నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎస్వీ సుబ్బారావు తెలిపారు. ఆలయాన్ని రంగులతో, చలువపందిళ్లతో ముస్తాబు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తొలి రోజు సంగీత విద్వాంసులతో గాత్రవిభావరి కార్యక్రమం, రెండో రోజు హనుమత్ సుదర్శన హోమం, నరసింహ హోమం, ఎదుర్కోలు అనంతరం కల్యాణ మహోత్సవం ఉంటుందని తెలిపారు. మూడోరోజు చతుర్ద కలశస్నపన, చక్రస్నానం, పూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షిణ, శ్రీపుష్పయాగం, ధ్వజావరోహణ, పవళింపు సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

దాడి కేసు నమోదు

పామర్రు: స్థానిక బిల్డింగ్ మెటీరియల్ అద్దెకు ఇచ్చే వ్యక్తిపై బాకీ ఇవ్వాల్సిన వ్యక్తి, అతని అనుచరుడు దాడి చేసిన సంఘటనపై శుక్రవారం పామర్రు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు కొల్ల నారాయణ అనే వ్యక్తి గతంలో బిల్డింగ్ మెటీరియల్ సామానులు అద్దెకు ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. 2017లో పామర్రు గ్రామానికి చెందిన భూపతిరెడ్డి అనే వ్యక్తికి సామానులు అద్దెకు ఇచ్చాడు. అప్పటి నుంచి సదరు భూపతిరెడ్డి సామానులు ఇవ్వకుండా అద్దె కూడా చెల్లించకుండా కాలయాపన చేస్తూ వచ్చాడు. ఈ నెల 6వ తేదీన సామానులు, వాటి అద్దె గురించి నారాయణ ప్రశ్నించాడు. ఈ విషయమై ఆగ్రహించిన భూపతిరెడ్డి అతడితో పాటు పాలకొల్లు శివ అనే వ్యక్తిని, మరొక టీడీపీ చోటా నేతతో కలిసి నారాయణషాపు వద్దకు వచ్చి చెక్కతో నారాయణపై దాడి చేశాడు. ఈ విషయమై నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పామర్రు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటనపై పామర్రు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు జాఫర్ అనే వ్యక్తి తన మోటార్ సైకిల్‌పై పామర్రు నుంచి కొండిపర్రుకు తన సొంత పని మీద వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో గుడివాడ వైపు నుంచి పామర్రుకు వస్తున్న మోటార్ సైకిల్ జాఫర్ బైక్‌ను ఢీకొని వెళ్లిపోయాడు. ఈ సంఘటనలో జాఫర్‌కు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: గుడివాడ సబ్ స్టేషన్‌లోని 33 కేవీ బస్ కండక్టర్ ఆధునీకరణ, సాంకేతిక మరమ్మతుల పనులు ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా ఆపివేయనున్నట్లు పేర్కొన్నారు. అయితే సాధారణ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదని అనివార్య కారణాలతో సరఫరా నిలిచిపోయినా.. వెంటనే అందజేస్తామని పేర్కొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలో విద్యుత్ సరఫరాకు శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.వి.శ్రీనివాసరరావు శుక్రవారం తెలిపారు. కొతవరం విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులకు సంబంధించిన ఈ విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని ముదినేపల్లి, పెదపాలపర్రు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ డివిజన్ ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్టాంప్ వెరిఫికేషన్ తప్పనిసరి

పామర్రు: పెట్రోల్ బంక్ యజమానులు వారి బంక్‌లకు సంబంధించిన స్టాంప్ వెరిఫికేషన్‌ను తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దార్ జీ రవికాంత్ పేర్కొన్నారు. మండలంలోని పెట్రోల్ బంక్‌లను, రేషన్ షాపులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన పెట్రోల్‌ను వినియోగదారులకు అందజేయాలన్నారు. అదేవిధంగా డీలర్లు సమయ పాలన నిర్వహిస్తూ రేషన్ పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్ డీటీ బి.రంగారావు, ఆర్ఐ ఏ రాము, వీఆర్వోలు లీలాకృష్ణ, ఉషారాణి పాల్గొన్నారు.